సాక్షి
ఖమ్మం

ఆదివారం । 21 । మే । 2023



రూ.2వేల నోట్లతో బారులు

ఆర్‌బీఐ రూ.2వేల నోట్లను రద్దు చేయడంతో ఆ నోట్లను మార్చుకునేందుకు బ్యాంకులు, ఏటీఎంల వద్ద బారులు దీరారు. 10లో



జాబ్‌మేళాకు ఏర్పాట్లుపూర్తి

పోలీసుశాఖ ఆధ్వర్యాన ఖమ్మం ఎస్‌బీఐటీలో ఆదివారం జరిగే జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తి కాగా సీపీ పరిశీలించారు. 10లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం వాతావరణం చల్లగా ఉండే అవకాశముంది. మధ్యాహ్నం తర్వాత మాత్రం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పల్లకీసేవలో అర్చకులు, భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈమేరకు అర్చకులు శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం చేయడంతో పాటు స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆతర్వాత తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి హాజరైన భక్తుల సమక్షాన అర్చకులు కురవి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకల్యాణం జరిపించారు. అనంతరం పల్లకీ సేవ జరిపించారు. ఈకార్యక్రమంలో ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయ కుమారి పాల్గొన్నారు.

27న బీజేపీ నిరుద్యోగ మార్చ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో ఈనెల 27న నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ మార్చ్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు ఇతర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనే డిమాండ్‌తో చేపడుతున్న ఈ మార్చ్‌కు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు, రేపు ఏఈఈ పరీక్ష

ఖమ్మం సహకారనగర్: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(ఏఈఈ) భర్తీకి టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన ఆది, సోమవారాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ పరీక్ష కోసం జిల్లాలోని ఐదు ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఆదివారం 1,270మంది, సోమవారం 1,270మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం పరీక్ష 10నుంచి 12–30గంటల వరకు, మధ్యాహ్నం పరీక్ష 2–30 నుంచి 5గంటల వరకు జరగనుందని అధికారులు వెల్లడించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న నాణ్యతను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల, ఎమ్మెల్యే

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా మహ్మదాపురంలో ఆగ్రోస్ ఏజన్సీ, పిండిప్రోలులో పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆతర్వాత తిరుమలాయపాలెంలోని రైతువేదిక వద్ద మండల సమాఖ్య నేతృత్వంలో ఏర్పాటుచేసిన రైతు సేవా కేంద్రం, వ్యవసాయ ఉపకరణాల అద్దె కేంద్రాన్ని కూడా వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మంగీలాల్, సొసైటీ చైర్మన్ చావా వేణు, ఏపీఎం అలివేలు మంగ, ఏఓ సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాల పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: పదో తరగతిలో 7జీపీఏ కంటే ఎక్కువ మార్కులు సాధించిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాల పథకంలో భాగంగా ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు వచ్చేనెల 3వ తేదీలోగా తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాల(2023 మార్చి)ల్లో పదో తరగతి పూర్తిచేసిన వారు మాత్రమే అర్హులని, గత ఏడేళ్ల స్టడీ సర్టిఫికెట్లు, మీ సేవా నుండి తీసుకున్న కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో భాగంగా కేంద్రియ, నవోదయ విద్యాలయాల్లో చదివిన వారు తమ కార్యాలయంలో సంప్రదించాక దరఖాస్తు చేసుకోవాలని డీడీ సూచించారు.

నిబంధనలు పాటించని రియల్టర్లు

- వ్యవసాయ భూములనూ వదలని వైనం
- లే ఔట్ అనుమతి లేకుండానే విక్రయాలు
- ఖమ్మం నగరం చుట్టుపక్కల ఇష్టారాజ్యం

నేలకొండపల్లిలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటైన వెంచర్



పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో అడుగడుగునా అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు లేకుండానే రియల్టర్లు, భూమి యజమానులు వెంచర్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వెంచర్లుగా మార్చి ప్లాట్లు విక్రయిస్తుండడంతో కొనుగోలు చేసి వారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 'సుడా' పరిధిలో కొన్నేళ్లుగా ఇలాంటి వెంచర్లు విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి. అక్రమ వెంచర్లపై గతంలో కలెక్టర్ ఆదేశాలతో అధికారులు కొరడా ఝుళిపించినా.. ఆతర్వాత షరామామూలుగానే సాగుతోంది.

నమ్మించి.. అంటకట్టి..

డీటీసీపీ లే ఔట్, ఇతర ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా, నిబంధనలు పాటించకుండానే రియల్టర్లు తమ వాక్చాతుర్యంతో మాయ చేస్తున్నారు. గ్రీన్‌బెల్ట్ కింద ప్రభుత్వానికి భూములను కూడా ఇవ్వడం లేదు. ఫలితంగా కొనుగోలుదారులు ఇళ్ల నిర్మాణ అనుమతుల కోసం వెళ్తే చుక్కెదురవుతోంది. గతంలో ఇటువంటి వెంచర్లపై దృష్టి సారించిన కలెక్టర్ నోటీసులు జారీ చేయించారు. ఆతర్వాత మళ్లీ గుట్టు చప్పుడు కాకుండా వెంచర్లు ఏర్పాటవుతున్నా... ఫిర్యాదులు అందితే తప్ప అధికారులు స్పందించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

నిబంధనలకు నీళ్లు..

వ్యవసాయ భూమిని వెంచర్‌లా మార్చి ఇళ్ల స్థలాలుగా అమ్మాలంటే పలు నిబంధనలు పాటించాలి. కానీ జిల్లాలోని రియల్ వ్యాపారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఎకరానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి ఇళ్ల స్థలాల కింద మార్చడంతో పాటు వెంచర్‌లోని 15 శాతం భూమి మున్సిపల్ కమిషనర్ పేరిట మార్టిగేజ్ చేయాలి. ఇంకా పది శాతం భూమిని పార్క్ కోసం కేటాయించాలి. అలాగే, విద్యుత్ స్తంభాలు, డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా... వ్యాపారులు వ్యవసాయ భూములను కొని ప్లాట్లుగా ప్రచారం చేసి గజాల చొప్పున ఎక్కువ ధరకు అమ్మేసుకుంటున్నారు.

గ్రామస్తుల ఫిర్యాదుతో చర్యలు

నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 14 ఎకరాల పంట పొలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. కేవలం నాలుగు ఎకరాల కన్వర్షన్‌కే దరఖాస్తు చేసుకుని మొత్తం ప్లాట్ల కింద అమ్మేందుకు సిద్ధమయ్యారు. ఈ అంశంపై గ్రామస్తులు కలెక్టర్ గౌతమ్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులను రంగంలోకి దింపారు. దీంతో శుక్రవారం గ్రామపంచాయతీ సిబ్బంది సదరు వెంచర్‌లో లే ఔట్ అనుమతి లేదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

'రియల్'కు పెరిగిన బూమ్

ఇటీవల జిల్లాలో రియల్ వ్యాపారానికి బూమ్ వచ్చింది. నగరం అభివృద్ధి చెందుతుండడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెంచర్లు వెలుస్తున్నాయి. అలాగే మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. ఫలితంగా జిల్లాలోని బోనకల్, చింతకాని, మధిర, కల్లూరు, ఖమ్మంరూరల్, కొణిజర్ల, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, పెనుబల్లి, రఘునాథపాలెం, సత్తుపల్లి, సింగరేణి, తల్లాడ, తిరుమలాయపాలెం, వేంసూరు, ఎర్రుపాలెం మండలాలతో పాటు నగరం చుట్టుపక్కల ఖమ్మంరూరల్, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లో వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తున్న రియల్టర్లు వెంచర్లుగా మారుస్తున్నారు. జిల్లాలో మొత్తం 125 వెంచర్లకు అనుమతులు ఉండగా.. ఇంతకు రెండు, మూడు రెట్ల స్థాయిలో అనుమతి లేని వెంచర్లు కొనసాగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.



లేఔట్ అనుమతి లేదని బోర్డు ఏర్పాటు చేస్తున్న నేలకొండపల్లి జీపీ సిబ్బంది

అధికారులు ఉక్కుపాదం మోపాలి



నేలకొండపల్లిలో జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంపై సమగ్ర విచారణ జరిపించాలి. ప్రభుత్వ ఆదాయనికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి. లే ఔట్ లేకుండానే ప్లాట్లుగా చేసి అమ్మేస్తున్నారు. అనుమతులు లేకుండా చేపడుతున్న ఇలాంటి వెంచర్లపై అధికారులు ఉక్కుపాదం మోపాలి.

– తోళ్ల సురేష్, నేలకొండపల్లి

నకిలీల కట్టడికి టాస్క్‌ఫోర్స్

వ్యవసాయ, పోలీస్ సమన్వయ సమావేశంలో సీపీ వారియర్

ఖమ్మంక్రైం: జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యాన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపేలా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిన నేపథ్యాన రెండు శాఖల అధికారులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అరికట్టడమే లక్ష్యంగా జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులతో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలోనూ టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపడుతూ పాత నేరస్తులపైనా నిఘా పెట్టడం ద్వారా ఫలితం ఉంటుందని తెలిపారు. ఎవరైనా అత్యాశతో అమాయక రైతులను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాల విక్రయానికి యత్నిస్తే పీడీ యాక్ట్ నమోదుకు వెనుకాడొద్దని చెప్పారు. గతంలో ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తులపై నిఘా ఉంచడంతో పాటు బైండోవర్ చేయాలన్నారు. అలాగే, రైతులు కూడా అవగాహన పెంపొందించుకుని నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు.

మద్యం రవాణాపై దృష్టి

మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు జిల్లా సరిహద్దుల్లో నిఘా పెంచామని సీపీ వారియర్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగిరెడ్డి, ఏసీపీలు గణేష్, బస్వారెడ్డి, రెహమాన్, రామనుజం, ప్రసన్నకుమార్, వెంకటస్వామి, వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ వారియర్

ముందస్తుగా వరిసాగు చేయండి..

- త్వరలోనే పంట నష్టపరిహారం అందుతుంది..
- రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే

సత్తుపల్లి: ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు, ఈదురుగాలులు వస్తున్నందున ముందస్తుగానే వరిసాగు చేయాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ సూచించారు. సత్తుపల్లిలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులు, రైతులకు జీలుగు విత్తనాలతో పాటు 58, 59జీఓల లబ్ధిదారులకు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలతో మామిడి, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతినగా నివేదికను ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. త్వరలోనే పంటనష్ట పరిహారం అందుతుందని చెప్పారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించండి

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని జీఓ 59ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు నిర్ణీత ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. సత్తుపల్లిలోని జలగంనగర్, వెంగళరావునగర్, ద్వారకాపురి కాలనీల్లో పర్యటించిన ఆయన దరఖాస్తుదారులకు ఫీజు చెల్లింపుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లిలో 59 జీఓ ద్వారా 1,259 దరఖాస్తులు రాగా, 120 మంది మాత్రమే ఫీజు చెల్లించారని, మిగతా వారు ఈనెల 30వ తేదీలోగా చెల్లించాలని సూచించారు. ఆతర్వాత పట్టణంలోని వేంసూరు రోడ్డులో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, మండలంలోని యాతాలకుంటలో సీతారామ టన్నెల్ పనులను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఇప్పటికైనా పనుల్లో వేగం పెంచకపోతే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. అంతేకాకుండా కిష్టారం, చెరుకుపల్లి సత్తెమ్మతల్లి ఆలయాలను సందర్శించాక 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ను సందర్శించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈకార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీపీ దొడ్డా హైమావతి, జెడ్పీటీసీ కూసంపూడి రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసు, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఏడీఏ నర్సింహారావు, ఎంపీడీఓ సుభాషిణి, బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌పాషా, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ సురేష్‌కుమార్, డీఈఈలు చంద్రశేఖర్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి : జీలుగు విత్తనాలను అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య



కల్లూరు : చెస్ శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్

వేగంగా అభివృద్ధి పనులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. వైరాలో పలు పనులను ఆయన పరిశీలించారు. ఇండోర్ స్టేడియం, టెన్నిస్ కోర్టుల పనులపై పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నారపోగు అరుణ, డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు మండలంలో...

కల్లూరు: కలెక్టర్ గౌతమ్ శనివారం సాయంత్రం కల్లూరు మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. ఆతర్వాత కల్లూరులోని మినీ స్టేడియంను సందర్శించి క్రీడా శిక్షణను పరిశీలించారు. ఆర్డీఓ సూర్యనారాయణ, డీఆర్డీఓ విద్యాచందన, డీవైఎఫ్ఓ పరంధామరెడ్డి, డీఎం సోములు, డీఎస్ఓ రాజేందర్, డీపీఎం దర్గయ్య, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీఓ బి.రవికుమార్, పీఆర్ డీఈ ఆర్.రాంబాబుతో పాటు ఎం.వెంకట్రామారావు, వీరస్వామి, రూప, పెద్దబోయిన మల్లేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో 24 నుంచి జ్యేష్ఠ మాసోత్సవాలు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో ఈనెల 24 నుంచి జ్యేష్ఠ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. జ్యేష్ఠ మాసం శనివారమే ప్రారంభమైనా వైదిక కమిటీ నివేదిక ప్రకారం ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 24న పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, రాత్రికి తిరువీధి సేవ, చుట్టుసేవ జరుపుతారు. 25న పుష్యమి నక్షత్రం సందర్భంగా రామయ్యకు పట్టాభిషేకం నిర్వహిస్తారు. 26న శుక్రవారం సాయంత్రం స్వామి వారికి సంధ్యాహారతి, రాత్రికి చుట్టుసేవ ఉంటాయి. 29న నమ్మాళ్వార్ తిరునక్షత్రోత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు విశేష సేవాకాలం, విశేష భోగ నివేదన జరుపుతారు. 31న సర్వ ఏకాదశి సందర్భంగా రాత్రికి స్వామివారికి తిరువీధి సేవ, చుట్టుసేవ జరుపుతారు. పవళింపు సేవ ఉండదు. అలాగే చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం నిర్వహిస్తారు. జూన్ 2న నమ్మాళ్వార్ తిరు నక్షత్రం సందర్భంగా ఉదయం ఆళ్వార్‌కు స్నపన తిరుమంజనం, సాయంత్రం సంధ్యాహారతి, స్వామి వారికి, నమ్మాళ్వార్‌కు చుట్టు సేవ జరుపుతారు. 3న జ్యేష్ఠాభిషేకాన్ని పురస్కరించుకుని సాయంత్రం వాస్తు హోమం, అంకురార్పణ చేస్తారు. 4న స్వామి వారికి 81కలశాలతో స్నపనం, హోమం, పూర్ణాహుతి, రాత్రికి తిరువీధి సేవ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిత్య కల్యాణం రద్దు చేస్తారు. 14న సర్వ ఏకాదశి సందర్భంగా అంతరాలయంలో లక్ష కుంకుమార్చన, విశేష భోగ నివేదన ఉంటాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి కోరారు.

అరగంటలో అల్లకల్లోలం



రఘునాథపాలెం మండలం బూడిదంపాడు వద్ద విరిగిపడిన చెట్లను పొక్లెయినర్‌తో తీయిస్తున్న దృశ్యం

- జిల్లాలోని పలుప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములతో వర్షం
- చెట్లు, స్తంభాలు విరిగిపడడంతో నిలిచిన రాకపోకలు, విద్యుత్ సరఫరా
- ధాన్యం, మక్కలు కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

ఖమ్మంవ్యవసాయం: జిలాల్లో శనివారం రాత్రి వాతావరణంలో ఒక్కసారిగా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. సాయంత్రం వరకు ఎండ, వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేయగా రాత్రి ఏడు గంటల తర్వాత ఈదురుగాలులు మొదలయ్యాయి. అలాగే, అర గంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పలుచోట్ల ఈదురుగాలులతో రహదారులపై చెట్లు విరిగిపడగా రాకపోకలు స్తంభించాయి. అలాగే, విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడడంతో సరఫరా నిలిచిపోయింది. కాగా, ఓ మోస్తరు వర్షంతో ప్రజలకు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం లభించినట్లయింది.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి..

ఖమ్మం నగరంతో పాటు, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, కొణిజర్ల, వైరా, తల్లాడ, కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం, పెనుబల్లి, మధిర, బోనకల్, చింతకాని, ఎర్రుపాలెం తదితర మండలాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కాగా, అకాల వర్షంతో రైతులు వరి, మొక్కజొన్నలను కాపాడుకునేందుకు పరుగులు తీశారు. పలుచోట్ల కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంతో కేంద్రాల్లో రాశులు పోసి ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే వర్షం కురవడంతో కాపాడుకునేందుకు యత్నించినా ఫలితం లేక పలు చోట్ల ధాన్యం, మక్కలు తడిసాయి.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపుల కారణంగా జిల్లావ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. పలుచోట్ల చెట్లు విరిగి తీగలపై పడగా.. మరికొన్ని చోట్ల స్తంభాలు విరిగిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోగా పునరుద్ధరించేందుకు ఎస్ఈ ఏ.సురేందర్ ఆధ్వర్యాన సిబ్బంది శ్రమిస్తున్నారు. కానీ జిల్లాలోని చాలాచోట్ల రాత్రంతా విద్యుత్ సరఫరా లేక ప్రజలు అంధకారంలోనే గడపాల్సి వచ్చింది.

ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిగా జిల్లా యువకుడు



తిప్పారెడ్డి ప్రణీత్‌రెడ్డి

ఖమ్మంఅర్బన్: మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఒక యువకుడు ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిగా ఎంపికయ్యాడు. ఖమ్మం చైతన్యనగర్‌కు చెందిన తిప్పారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి – సుధామణి దంపతుల కుమారుడు ప్రణీత్‌రెడ్డి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ స్థాయి(కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్) ప్రాథమిక పరీక్ష 2022లో, ప్రధాన పరీక్ష ఈఏడాది మార్చిలో రాయగా, జాతీయ స్థాయిలో 1,990వ ర్యాంక్ సాధించాడు. ఈమేరకు ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిగా ఎంపిక కాగా, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఉద్యోగంలో చేరనున్నట్లు ప్రణీత్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ వరకు ఖమ్మంలో, మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ హైదరాబాద్‌లో పూర్తిచేసిన ఆయన టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తూనే పరీక్షకు సిద్ధమై సత్తా చాటడం విశేషం. ఆయన తండ్రి ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగి కాగా, తల్లి గృహిణి. అలాగే, ప్రణీత్ సోదరి ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది.



క్లుప్తంగా

సీపీఐ బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చేనెల 4న కొత్తగూడెంలో జరగనున్న సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు కోరారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ జాతీయ నేతలతో పాటు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొననున్న ఈ సభకు జిల్లా నుంచి వేలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కే జానీమియా, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంపన్న వర్గాలకు కొమ్ముకాస్తున్న కేంద్రం

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో కార్పొరేట్ కంపెనీలు, సంపన్న వర్గాలకు నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ ఆరోపించారు. ఖమ్మం లెనిన్‌నగర్‌లోని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాన్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో పెద్ద నోట్లను రద్దు చేయడం దేశ ప్రయోజనాల కోసమేనని చెప్పగా.. ఆ నిర్ణయంతో కార్పొరేట్ శక్తులకే లబ్ధి జరిగిందని చెప్పారు. ఇప్పుడు రూ.2 వేల నోట్ల రద్దు కూడా సంపన్న వర్గాల కోసమేనని ఆరోపించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వెంకన్నతో పాటు దాట్ల వీరస్వామి, గోపి, రవి, ఎం.ఉప్పలయ్య, బ్రహ్మచారి, కె.మధు, జాన్‌రెడ్డి, పోకల వెంకన్న, రాములు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


కూసుమంచిలోని ఓ షాప్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కూసుమంచి: కూసుమంచి మండలంలోని పలు విత్తన దుకాణాలను శనివారం స్టేట్‌టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. డీలర్ల దుకాణాల్లోని రిజిస్టర్లు, స్టాక్ పరిశీలించిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ దుకాణంలో స్టాక్‌బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రతీ అమ్మకంపై రశీదు ఇవ్వాలని సూచించారు. కల్తీ విత్తనాలు, పురుగు మందులు అమ్మే ప్రయత్నం చేయొద్దని తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ శివానంద్, కూసుమంచి ఏఓ వాణి, విత్తన ధ్రువీకరణ అధికారి వేణుమాధవ్, టెక్నికల్ ఏఓ రాజు పాల్గొన్నారు.

విందులో ఘర్షణ.. నలుగురికి గాయాలు

చింతకాని: మండలంలోని నాగులవంచలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం ఒక శుభకార్యం జరిగింది. ఈమేరకు సమీప బంధువులకు శుక్రవారం విందు ఏర్పాటు చేయగా, ఇరు కుటుంబాల నడుమ ఘర్షణ జరిగింది. అసభ్య పదజాలంతో దూషించుకుంటూ పరస్పరం కర్రలతో దాడి చేసుకోగా అన్నదమ్ములైన పడిశాల దినేష్, నవీన్ తలకు తీవ్ర గాయాలు కాగా శెట్టిపోగు గోపి, సామేలుకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై ఇరువర్గాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య


జ్యోతి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువులో దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సత్తుపల్లికి చెందిన భారతీదేవి మనమరాలైన మల్లారెడ్డి జ్యోతి(26)కి తల్లిదండ్రులు లేరు. ఆమెకు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం అప్పారావుపేట కు చెందిన సురేశ్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వేసవి సెలవుల్లో ఇటీవల సత్తుపల్లిలోని అమ్మమ్మ ఇంటికి పిల్లలతో కలిసి వచ్చింది. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ శనివారం బేతుపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియకపోగా, ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాము తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో మధిర వాసి మృతి

మధిర: మండలంలోని సిరిపురానికి చెందిన ఏసుపోగు రామారావు ఛత్తీస్‌గఢ్‌లో మృతి చెందాడు. తాపీ పని కోసం మూడు రోజుల క్రితం వెళ్లిన ఆయన ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లా గీదం తహసీల్ పరిధిలోని ఓ చెరువులో మునిగి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అక్కడి పోలీసులు ఆయన మృతదేహాన్ని స్థలానికి పంపిస్తున్నట్లు తెలిసింది.

చెస్‌తో చురుకుదనం!

- కొత్త ఆలోచనలకు పునాది కూడా..
- రెజొనెన్స్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు
- సాక్షి మీడియా, రెజొనెన్స్ శ్రీనగర్ ఆధ్వర్యాన విద్యార్థులకు పోటీలు


పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న రెజొనెన్స్ డైరెక్టర్ శ్రీధర్‌రావు, పక్కన ఉపాధ్యాయులు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులు చెస్ ఆడడం వల్ల చురుకుదనం పెరుగుతుందని ఖమ్మం శ్రీనగర్‌కాలనీలోని రెజొనెన్స్ స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు పేర్కొన్నారు. 'సాక్షి'మీడియా, రెజొనెన్స్ శ్రీనగర్ కాలనీ పాఠశాల ఆధ్వర్యాన వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు శనివారం చెస్(చదరంగం) పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన శ్రీధర్‌రావు మాట్లాడుతూ సాక్షి మీడియా విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని తెలిపారు. ఇందులో చెస్ ఆడటం వల్ల విద్యార్థులు కొత్త ఆలోచనల వైపు దృష్టి సారిస్తారని, ఎదుటి వారి ఆలోచనలను గుర్తించడం కూడా అలవడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ఉపాధ్యాయులు, సిబ్బంది కృష్ణ, హరిత తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన

సాక్షి మీడియా ఆధ్వర్యాన నిర్వహించిన చెస్ పోటీలకు నగరంలోని విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని పోటాపోటీగా ఎత్తులకు పైఎత్తులు వేస్తూ సత్తాచాటారు.


చెస్ ఆడుతున్న విద్యార్థులు

చెస్‌తో మెదడు చురుకవుతుంది..



చెస్ ఆడటం వల్ల మైండ్ షార్ప్ అవుతుంది. చిన్నప్పుడే చెస్ నేర్చుకున్నాను. ఇప్పటికే చాలాచోట్ల పోటీల్లో కూడా పాల్గొన్నా. ఎదుటి వారి ఎత్తులకు పైఎత్తు వేసే దిశగా ఆలోచిస్తుండడంతో మెదడు చురుకవుతుంది. పోటీలు నిర్వహించిన 'సాక్షి'కి ధన్యవాదాలు. ఇలాంటి పోటీలు మరిన్ని నిర్వహించాలని కోరుకుంటున్నా.

– బి.ఉమేశ్, ఆరో తరగతి

మా నాన్నను చూసి నేర్చుకున్నా..



మా నాన్న చెస్ ఆడుతుండగా చూసి ఆయన వద్దే నేర్చుకున్నా. నిత్యం ప్రాక్టీస్ చేస్తుండడంతో ఆటపై పట్టు లభించింది. 'సాక్షి'మీడియా నిర్వహించిన చెస్ పోటీల్లో పాల్గొనటం ఆనందంగా ఉంది. ఇలాంటి పోటీలు మరిన్ని నిర్వహించాలని కోరుతున్నా.

– ఎస్‌కే మార్యామీరాజ్, పదో తరగతి

లాక్‌డౌన్ సమయాన ఆసక్తి



కరోనా లాక్‌డౌన్ సమయాన ఇంట్లో ఖాళీగా ఉన్నప్పుడు చెస్‌పై ఇష్టం ఏర్పడింది. మా నాన్న వద్ద ఆట నేర్చుకుంటూ నిత్యం ప్రాక్టీస్ చేశాను. ఇప్పుడు కూడా ఖాళీ సమయాల్లో కుటుంబ సభ్యులతో చెస్ ఆడుతుండడంతో మరింత పట్టు లభించింది.

– లిఖిత సాయి, పదో తరగతి

ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నా..



చెస్ ఆడుతుంటే మంచి ఉత్సాహం వస్తుంది. కొన్ని నెలలుగా చెస్ నేర్చుకుంటూ పట్టు పెంచుకుంటున్నాను. ఇంతలోనే 'సాక్షి'మీడియా పోటీలు ఏర్పాటుచేయడంతో హాజరయ్యా. ఎక్కడ పోటీలు జరిగినా హాజరుకావాలని నిర్ణయించుకున్నా.

– కె.దుర్గామహేశ్వర్‌రెడ్డి, ఆరో తరగతి

అకాల వర్షంతో ఇక్కట్లు

- విరిగిపడిన చెట్లతో స్తంభించిన రవాణా
- జిల్లా అంతటా విద్యుత్ సరఫరాకు అంతరాయం


వైరా రూరల్ : వైరా - తల్లాడ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు


వైరా రూరల్ : ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న ఎస్సై శాఖమూరి వీరప్రసాద్


కొణిజర్ల : విజయ కాలేజీ వద్ద సహాయక చర్యల్లో పోలీసులు


కారేపల్లి : పెట్రోల్‌బంక్ సమీపాన ఆర్టీసీ బస్సుపై కూలిన చెట్టు

వైరారూరల్: వైరాలోని వైరా–తల్లాడ జాతీయ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఈదురు గాలులకు భారీ వృక్షాలు కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి 7గంటల నుండి అర గంట పాటు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. వైరాలోని సాయిబాబా ఆలయ సమీపాన జాతీయ ప్రధాన రహదారిపై ఐదు భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. దీంతో గంట పాటు వాహనాలు నిలిచిపోగా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, సీఐ తాటిపాములు సురేష్, ఎస్సై వీరప్రసాద్, సిబ్బంది చేరుకుని ప్రొక్లెయినర్లతో చెట్లను తీయించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. కాగా, పలు గ్రామాల్లో ధాన్యం రాశులు, మొక్కజొన్న తడిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- **ఏన్కూరు:** మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి కల్లాల్లో మొక్కజొన్న, ధాన్యం తడిసిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు పట్టాలు తీసుకొని పరుగులు తీశారు.
- **ఎర్రుపాలెం:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన వర్షం పడింది. అయితే, వాతావరణ శాఖాధికారుల సూచనలతో సాయంత్రమే రైతులు అప్రమత్తమైనా పంటలు తడిసాయని చెబుతున్నారు.
- **తిరుమలాయపాలెం:** ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండగా.. శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థ పడ్డారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతుండడంతో రైతులు కంటిమీద కునుకు లేకుండా కాపలా కాయాల్సి వస్తోంది.
- **తల్లాడ:** తల్లాడలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వరి ధాన్యంపై పట్టాలు కప్పినా వరద కింద నుంచి వెళ్లి వడ్లకు పట్టింది.
- **కొణిజర్ల:** మండలంలో ఈదురుగాలలతో కూడిన వాన బీభత్సం సృష్టించింది. విజయ కాలేజీ వద్ద రహదారిపై భారీ వృక్షం పడడంతో పోలీసులు చేరుకుని చెట్టును తీయించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. అలాగే, పలుచోట్ల రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- **రఘునాథపాలెం :** మండలంలోని ఖమ్మం –ఇల్లెందు రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. మంచుకొండ, రఘునాథపాలెం, బూడిదంపాడుల్లో కూడా విరిగిపడిన చెట్లను పోలీసులు జేసీబీలతో తీయించి రవాణాను పునరుద్ధరించారు. ధాన్యం, మొక్కజొన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లపై పడిన 33 కేవీ విద్యుత్ వైర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని 34వ డివిజన్‌లో పంపింగ్‌వెల్ రోడ్డులో ఫిల్టర్ బెడ్ వద్ద 33 కేవీ విద్యుత్ లైన్‌కు సంబంధించి తీగ తెగి ఇళ్లపై పడింది. దీంతో మెరుపుతో కూడిన కాంతి రావడంతో సోమ లక్ష్మమ్మ, చంద్రకళ మూర్ఛపోయారు. అయితే, తీగ తెగిపడిన సమయాన కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. కాగా, ఈ ఘటనతో ఆ ప్రాంతంలో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

- **కారేపల్లి :** మండలంలో ఈదురుగాలులతో వర్షం బీభత్సం సృష్టించింది. కారేపల్లి క్రాస్ రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపాన ఖమ్మం ప్రధాన రహదారిపై ఖమ్మం నుండి ఇల్లెందు వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోగా ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు


సభ్యత్వం అందిస్తున్న అఫ్జల్‌హసన్

ఖమ్మంసహకారనగర్: టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్ సాగర్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ అన్ని శాఖల ఉద్యోగులు సభ్యత్వ నమోదుకు ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నందగిరి శ్రీను, జీఎస్ ప్రసాదరావు, చుంచ వీరనారాయణ, మజీద్, శాబాసు జ్యోతి, స్వప్న, నాగుల్ మీరా, నవీన్, సాయిశిరణ్మయి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

కూసుమంచి: ప్రజల నడుమ కులాలు, మతాల పేరిట చిచ్చుపెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. మండలంలోని మల్లేపల్లిలో నిర్మించిన సీపీఎం కార్యాలయాన్ని శనివారం రాత్రి ఆయన ప్రారంభించి మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో అభివృద్ధి కంటే నష్టమే ఎక్కువగా జరిగిందని చెప్పారు. కార్పొరేట్ శక్తులు, దోపిడీదారులకు మేలు చేస్తున్న ప్రధాని మోదీ.. సామాన్యులపై మాత్రం ధరల భారం మోపుతున్నారని విమర్శించారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలతో బీజేపీ పతనం మొదలైందన్నారు. కాగా, సీపీఎం కార్యాలయం పోరాటాలకు కేంద్రంగా ఉండాలని తమ్మినేని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండ రమేశ్, పద్మ, గుడవర్తి నాగేశ్వరరావు, ఎడవెల్లి రమణారెడ్డి, చీర్ల రాధాకృష్ణ, సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కన్నుమూసి తెరిచే లోగా గొలుసు చోరీ


బాధితురాలు కృష్ణవేణి


సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో పట్టపగలే ఓ మహిళ మెడలో గొలుసు చోరీ జరిగింది. మండలంలోని ముజ్జుగూడెంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్న గొల్లపూడి కృష్ణవేణి శనివారం నేలకొండపల్లిలో బంధువుల ఇంటికి వచ్చి వెళ్తోంది. గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపాన బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని రెండు తులాల బంగారు చైన్ లాక్కుని పారిపోయాడు. ఆమె తేరుకునే లోపే ఆగంతకుడు పారిపోవడంతో కూసుమంచి సీఐ జితేందర్, నేలకొండపల్లి ఎస్‌ఐ స్రవంతి చేరుకుని సమీప షాపుల్లోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు.

రైతుల మధ్య దారి ఘర్షణ

కూసుమంచి: మండలంలోని జుజుల్‌రావుపేటలో పొలానికి వెళ్లే దారి విషయమై శనివారం రైతుల మధ్య ఘర్షణ చోటుకుంది. ఈ క్రమంలో ఓ వ్యక్తి కత్తితో దాడికి యత్నించాడు. గ్రామానికి చెందిన రైతులు శ్రీరాముల వీరస్వామి, బక్కతట్ల వెంకన్న, ఆయన అన్నదమ్ముల మధ్య దారి తగాదా నడుస్తోంది. ఈ క్రమంలో వీరస్వామితో పాటు నవీన్, మైబూబా జేసీబీతో దారిని తొలగించే ప్రయత్నం చేస్తుండగా బక్కతట్ల వెంకన్న అడ్డుకున్నాడు. దీంతో వారు తనపై కత్తితో దాడికి యత్నించడమే కాక చంపుతామని బెదిరించారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేశ్‌కుమార్ తెలిపారు. అలాగే, బక్కతట్ల ఉప్పయ్య, వెంకన్న, రాములు, మల్లయ్య, గోవర్ధన్ తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి కొట్టారని శ్రీరాముల మైబూబా చేసిన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పాల్వంచరూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం శివారు వైకుంఠధామం సమీపంలో బీసీఎం జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ మధ్య ఉంటుందని, కుడి చేతికి స్టీల్ కడియం, హనుమాన్ బొమ్మ లాకెట్ ఉందని, నలుపు గీతలు కలిగిన తెల్లచొక్క ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్)

పెనుబల్లి : మండలంలోని వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ జానపాటి వెంకటేశ్వర్లు(57) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయాన్నే విధులకు హాజరైన ఆయన స్టేషన్ నుండి ద్విచక్రవాహనంపై వీఎం బంజర్ రింగ్ సెంటర్ వైపు వెళ్తే క్రమాన అపస్మారక స్థితికి చేరుకోవడంతో బండి అదుపుతప్పి పడిపోయాడు. దీంతో స్థానికులు ఆయనను పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేక వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతదేహం వద్ద సీఐ సీహెచ్.హనూక్, ఎస్సై సూరజ్, సిబ్బంది నివాళులర్పించి స్వగృహానికి తరలించారు.

వడదెబ్బతో వ్యక్తి..

మధిర: మండలంలోని మల్లవరానికి చెందిన వ్యక్తి వడదెబ్బకు గురై శనివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన సంపసాల కృష్ణ (70) రెండు రోజులుగా ఎండ వేడి, వడగాలులతో వడదెబ్బ బారిన పడి మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి...


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఖాజీపుర మసీదు సమీపాన గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అక్కడో వ్యక్తి స్పృహ కోల్పోగా స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 87126 59107 నంబర్‌లో సంప్రదించాలని ఖమ్మం వన్ టౌన్ పోలీసులు సూచించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

తిరుమలాయపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని చంద్రుతండాకు చెందిన బోడ ప్రభాకర్ (28) శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై పొలం వద్దకు వెళ్తుండగా మరిపెడ వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రభాకర్‌ను ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మూడు మోటార్ సైకిళ్లు దగ్ధం

ఖమ్మంరూరల్: మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ముగ్గురి ద్విచక్ర వాహనాలను శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. కాలనీకి చెందిన బానోతు కృష్ణమోహన్, బానోతు అనిల్ తమ మూడు వాహనాలను ఇంటి ముందు పార్క్ చేసి నిద్రించారు. తెల్లారేసరికి మూడు వాహనాలు పూర్తిగా దగ్ధం కావడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

గంజాయి పట్టివేత

కొత్తగూడెంఅర్బన్: ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యాన లక్ష్మీదేవిపల్లిలోని లోతువాగు దగ్గర శనివారం చేపట్టిన తనిఖీల్లో ఐదు కేజీల గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనంపై ఒడిశా నుంచి ఖమ్మంకు గంజాయి తరలిస్తున్న తాళ్లూరి కృష్ణార్జున్‌ను అరెస్ట్ చేశారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ముబషీర్, అహ్మద్, సిబ్బంది కరీం, బాలు, హరీష్, హన్మంతరావు, వెంకటేష్, సుధీర్ పాల్గొన్నారు.

కంటెంట్ & మెథడ్స్ రేపే నూతన బ్యాచ్ ప్రారంభం
గురుకుల టీచర్స్ TGT/PGT
Maths / Social / Phy / Bio / Telugu / English / లైబ్రరి
కైట్స్ అకాడమి రైల్వేస్టేషన్ దగ్గర, ఖమ్మం. సెల్: 8897766037

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ 6 నెలల్లో 10th, ఇంటర్, డిగ్రీ, PG, ITI, డిప్లమా B.Tech, D.M.L.T., M.L.T., ANM, GNM, నర్సింగ్, D. ఫార్మశీ, B. ఫార్మశీ, B.A.M.S, B.H.M.S పూర్తిచేయండి. ✆ 95504 43817 [B-758931]

HOME TUTIONS
■ VENU HOME TUTIONS : 1 to 10th all subjects Inter, EMCET, IIT, JEE, Degree, B.Tech., Spoken English, Welcome to Tutiors. Cell : 89196 56387, 95810 90860. [M-1190736]

FREE HR TRAINING
■ PRAISE THE LORD: పేద అమ్మాయిలకు HYD కూకట్‌పల్లిలో ఫ్రీ-వసతితో HR+ మీడియా+ డిజి॥ మా॥+అకౌంట్స్+కం॥120 డేస్ ట్రైనింగ్, తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్ ఆదాయం, డిగ్రీ, స్మార్ట్ ఫోన్ మస్ట్.9032944447 [HA-5738]

Real Estate

■ ఖమ్మం పరిసర ప్రాంతాలలో ఇండ్లు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్ అమ్మిపెట్టబడును/కొనిపెట్టబడును. 40 లక్షలలో అపార్ట్‌మెంట్స్ కలవు. హోమ్‌లోన్, బ్యాంక్ లోన్ ఇప్పించబడును. సంప్ర. 91007 57031 [M-1190698]

HOUSE FOR SALE
■ ఖమ్మం, శ్రీనివాసనగర్, అయ్యప్పస్వామి గుడి దగ్గరలో 144 Sq.yds లో ఇల్లు కలిగిన మొత్తం 417 చ॥గ॥ల ఓపెన్ ప్లాట్ ఇంటితో సహా అమ్మబడును. సంప్ర. 91107 02635. [M-1221153]

FLAT FOR SALE
■ LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3219]

Services

INSURANCE
■ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు కట్టించబడును మరియు ఫ్యామిలీ యాక్సిడెంట్ పాలసీలు కలవు. వివరాలకు సంప్ర. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్, ఖమ్మం. సెల్ : 91007 57031. [M-1190699]

BUSINESS OFFER
■ ప్రముఖ డిటర్జెంట్ లిక్విడ్‌జెల్ (FOAMX) మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) మండలాలవారిగా కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఇన్సెంటివ్స్ కలవు. 6301693200, 8328112901. [M-1190690]
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం, ఫోన్: 9310515624, 8800496710 [DA-36266]

OLD AGE HOME
■ మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296 /7981467036 /6281127224. [H-781615]

Wanted

■ శ్రీశ్రీశ్రీ హీరో షోరూంలో పని చేయుటకు కార్ డ్రైవర్ వెంటనే కావలెను. వైరా రోడ్, ఖమ్మం. వివరాలకు సంప్ర. 93983 94032. [M-1221156]
■ Ravi Dry Fruits : Wanted Sales Boys, Two Wheeler Must. Khammam. Contact Cell : 97013 26863. [M-1221158]
■ ఖమ్మం రియల్ ఎస్టేట్ నందు సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేయుటకు యువతీ/యువకులు కావలెను. జీతం : 12 వేలు+ఇన్సెంటివ్+ఉచిత ట్రైనింగ్. అర్హత : ఇంటర్, Age : 25+, Cell : 83413 40900. [M-1221159]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221303]
■ హైదరాబాద్, విజయవాడలలో చిన్నపిల్లల ఇళ్ళ వద్దే ఉంటూ చూసుకొనుటకు అనుభవం గల ఆయాలు, బేబీ సిట్టర్స్ కావలెను. వసతి + భోజనం + జీతం. ✆ 78158 35561 / 91608 35559 [B-087]
■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90800 44646. [B-1165937]
■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786333]
■ మా కంపెనీ నందు కలెక్షన్ చేయుటకు గర్ల్స్& బాయ్స్ కావలెను. 2 వీలర్ ఉన్నవారికి ప్రాధాన్యత. అ: 10th to డిగ్రీ, జీ: 16,000 to 32,000+OT. 7032741527, 9618204720. [T-190348]
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-797521]
■ అనుభవం గల ఫోటోషాప్ డిజైనర్ & ఫ్లెక్స్ ప్రింటింగ్ ఆపరేటర్ జీతం : 15K-25K చిన్న ఫ్లెక్స్ ప్రింటింగ్, అశోక్‌నగర్, Hyd. 9848234571 [HA-93088]
■ హైదరాబాద్‌లో పెట్రోల్ బంకులో పనిచేయుటకు Exp./ సేల్స్ మ్యాన్, హెల్పర్ కావలెను. మంచి జీతం: R.P. రోడ్, Sec-sobad & బోయిన్‌పల్లిలో కావలెను. ఫోన్ : 6301138273, 8008082516 [H-778993]
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K-18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్:9640258899, [H-793430]
■ నిడదవోలు, శంకరాపురం, (గ్రామం), యర్నగూడెం రోడ్, హృదయాలయం ఉచిత మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో పిల్లల సంరక్షణ ఆయాలు ఫ్రీ-2 జీతం:15000/- మగ-1, అసిస్టెంట్ టీచర్/వార్డెన్ (ఫ్రీ) -2, జీతం: 12000/- డ్రైవర్ జీతం 14000/-, సంప్ర : 62817 04979, 94409 42148. [P-322]

WANTED TEACHERS
■ Wanted Lady Teachers for all Subjects upto 7th class. Knowledge of Spoken Englis is preferable. Contact : Principal, Lumbini Vidya Nilayam, Mustafa Nagar, KMM. 8309816861. [M-1221304]
■ Wanted Young Lady Teachers only Pre-Nursery to 5th (Fluency English Must), Lady Computer & ఆయాలు కావలెను. గాంధీచౌక్, ఖమ్మం. 9392778297, 9100540892. [M-1190689]
■ Wanted Qualified English Speaking Math, Teacher, 15000 Per Month. A.Y. English Medium School, Kambotlapalem, W.G. dt. AndhraPradesh. Ph. 9347658390. send resume to: ftwn_1999@yahoo.com [P-861]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...


వేమూరు నుంచి కొల్లూరు వరకు పాద యాత్ర చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

కావలి/వేమూరు/ఏర్పేడు/చీపురుపల్లి: పేదలకు స్థలాలు, ఇళ్ల ఇస్తుంటే ఓర్వలేని చంద్రబాబు పేదల ద్రోహిగా మారి వారిపై అక్కసు వెళ్లగక్కుతున్నారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలో పలుచోట్ల శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సెంటు స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తుంటే చూసి ఓర్వలేని చంద్రబాబు సెంటు స్థలంలో సమాధులు కట్టుకోవాలా అంటూ అహంకారపూరితంగా మాట్లాడుతున్నాడని నాయకులు ఈ సందర్భంగా మండిపడ్డారు. బాపట్ల జిల్లా వేమూరులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి కొల్లూరు అనంత భోగేశ్వరస్వామి ఆలయం వరకు పేదలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పాదయాత్ర జరిపారు. పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు, ఇళ్లపై అపహేళన చేస్తూ మాట్లాడిన చంద్రబాబుపై కేసు నమోదు చేసి తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ విజయనగరం జిల్లా చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇళ్ల లబ్ధిదారులు శనివారం ఫిర్యాదు చేశారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్న చంద్రబాబు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఎన్నికల్లో ప్రజలు ఓడించారన్న అక్కసుతో చంద్రబాబునాయుడు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్నారని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. రాష్ట్రం అన్ని విధాలా బాగు పడుతుంటే చూడలేని చంద్రబాబు.. పిచ్చి ప్రేలాపనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విశాఖ ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం మీద, ఓడించిన ప్రజల మీద, ఉత్తరాంధ్రపై.. ముఖ్యంగా విశాఖపట్నంపై చంద్రబాబు ఎందుకంత పగబట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తండ్రి హంతకులకు అండదండలా?

వివాదాస్పదంగా మారిన సునీత వైఖరి

జైల్లో ఉన్న ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు తాజాగా యత్నం

- వివేకా హంతకుడు దస్తగిరి బెయిల్ రద్దు పిటిషన్‌ను వ్యతిరేకించిన సునీత
- వాస్తవాలు వెల్లడించకుండా కట్టడి చేసేందుకే సునీత తాపత్రయం
- తన భర్త, బావ పాత్ర బయటపడకుండా ఉంచాలన్నదే లక్ష్యం

సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత తీరు మరోసారి వివాదాస్పదమైంది. తండ్రిని హత్యచేసిన వారికి శిక్షలు పడేందుకు పోరాడుతున్నానని చెబుతున్న ఆమె వ్యవహారశైలి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉండటం అనేకానేక సందేహాలు లేవనెత్తుతోంది. వివేకాను హత్యచేశానని స్వయంగా ఒప్పుకున్న దస్తగిరికి ఆమె పూర్తి అండదండలు అందిస్తుండటం తెలిసిందే. మరోవైపు.. వివేకా హత్యకేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డిని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో కలిసేందుకు సునీత శుక్రవారం ప్రయత్నించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దస్తగిరి బెయిల్ వ్యవహారంలో సునీత వ్యవహారశైలి.. అనంతరం ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు ఆమె యత్నించడానికి సంబంధం ఉన్నట్లుగా స్పష్టమవుతోంది. తన తండ్రి హత్య కేసులో ప్రధాన నిందితులను ప్రభావితం చేయడం ద్వారా ఈ కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు ఆమె యత్నిస్తున్నట్లుగా స్పష్టమవుతోంది. అసలు వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు ఆయన హత్యకు దారితీసి ఉండొచ్చన్న బలమైన ఆరోపణలకు సునీత ప్రస్తుత వ్యవహారశైలి బలం చేకూరుస్తోంది.

హంతకుడు దస్తగిరికి సునీత అండదండలు..

సాధారణంగా తండ్రిని హత్యచేసిన వారిపై ఎవరికైనా ఆగ్రహం ఉంటుంది. కానీ, వైఎస్ వివేకానందరెడ్డిని స్వయంగా హత్యచేశానని ఒప్పుకున్న దస్తగిరిపై ఆయన కుమార్తె సునీత అంతులేని సానుకూలత ప్రదర్శిస్తున్నారు. సీబీఐ దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడాన్ని ఆమె ఏమాత్రం వ్యతిరేకించలేదు. అనంతరం.. బెయిల్ కోసం దస్తగిరి పిటిషన్ వేస్తే సీబీఐ అభ్యంతరం వ్యక్తంచేయలేదు. అంతేకాదు.. సునీత కూడా అతని బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకించలేదు. మరోవైపు.. అసలు హత్యచేసిన దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడాన్ని వివేకా పీఏ కృష్ణారెడ్డి న్యాయస్థానంలో సవాల్ చేశారు. అతనికి ఇచ్చిన బెయిల్‌ను రద్దుచేయాలని కూడా కోర్టును కోరారు. కానీ, సునీత వెంటనే ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం విస్మయపరిచింది. అలాగే, దస్తగిరి బెయిల్‌ను రద్దుచేయాల్సిన అవసరంలేదని ఆమె న్యాయస్థానికి తెలపడం గమనార్హం. అంతేకాదు.. ఈ కేసుకు సంబంధించి కృష్ణారెడ్డికి ఎలాంటి అర్హతలేదని.. బాధితురాలిగా తనకే అది ఉందని ఆమె వాదించారు. దస్తగిరి బెయిల్‌పై బయట ఉండటంపట్ల తనకేమాత్రం అభ్యంతరంలేదని చెప్పుకొచ్చారు. అసలు తన తండ్రిని హత్యచేసిన వ్యక్తి జైలులో ఉండాలని కోరుకోవాల్సిన సునీత.. అతను బయట ఉండాలని ఆశిస్తుండటం వెనుక ఏదో మతలబు ఉందన్నది స్పష్టమవుతోంది.

దస్తగిరి వాంగ్మూలాన్ని బలపర్చాలనే..

నిజానికి.. దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్న అంశాలతో ఎర్ర గంగిరెడ్డి విభేదించారు. సీబీఐ నమోదు చేసిన దస్తగిరి అప్రూవర్ వాంగ్మూలంలో చెప్పినవన్నీ అవాస్తవాలని ఆయన చెప్పారు. దాంతో దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలం అంతా కట్టుకథేనని తేలిపోయింది. ఈ నేపథ్యంలో.. ఎర్ర గంగిరెడ్డిని కలిసి దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలంలోని అంశాలను బలపరచాలని ఒత్తిడి చేయడమే సునీత ఉద్దేశంగా తెలుస్తోంది. అందుకోసం ఎర్ర గంగిరెడ్డిని ప్రలోభాలకు గురిచేయడం.. ఆయన బెయిల్‌కు సీబీఐ సహకరించేట్లుగా చేస్తానని హామీ ఇవ్వడం ఆమె ప్రణాళికగా ఉంది. వివేకా హత్య అనంతరం అక్కడ ఆధారాలను ధ్వంసం చేయాలని ఎర్ర గంగిరెడ్డిని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. ఇదే అంశం సునీత, ఆమె భర్తకు ప్రతికూలంగా మారింది. ఈ విషయంలో మాట మార్చాలని.. ఆధారాల ధ్వంసంతో తన భర్తకు సంబంధంలేదని ఎర్ర గంగిరెడ్డితో చెప్పించాలన్నది సునీత ఉద్దేశం. తాను చెప్పినట్లు చేస్తే ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ వచ్చేందుకు సహకరిస్తామని ఆమె హామీ ఇచ్చేందుకు యత్నించినట్లు తెలిసింది.

ఎర్ర గంగిరెడ్డిని కలిసే ప్రయత్నం ఎందుకో!?

ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న ఎర్ర గంగిరెడ్డిని జైల్లో కలిసేందుకు సునీత ప్రయత్నించడం ఇప్పుడు విస్మయపరుస్తోంది. గంగిరెడ్డిని కలిసేందుకు ఆమె జైలు అధికారులను అనుమతి కోరగా వారు నిరాకరించారు. దాంతో ఆమె తన న్యాయవాది ద్వారా కొన్ని పత్రాలు ఆయన వద్దకు పంపి సంతకాలు తీసుకున్నట్లు సమాచారం. అసలు తన తండ్రి హత్య కేసులో ఏ–1గా ఉన్న గంగిరెడ్డిని సునీత కలిసేందుకు యత్నించడం సందేహాస్పదంగా మారింది. సుప్రీంకోర్టు బెయిల్ రద్దుచేయడంతో ఎర్ర గంగిరెడ్డి పోలీసుల ముందు లొంగిపోయి ప్రస్తుతం జైలులో ఉన్నారు. తాను చెప్పినట్లుగా చెబితే దస్తగిరికి సహకరించినట్లుగానే ఎర్ర గంగిరెడ్డికి సహకరిస్తామని ఆయనకు చెప్పేందుకే సునీత ప్రయత్నించినట్లు సమాచారం.

వేళ్లన్నీ సునీత, ఆమె భర్తవైపే..

ఈ మొత్తం పరిణామాలతో వివేకా హత్యకేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు సునీత ప్రయత్నిస్తున్నారన్నది స్పష్టమైంది. ఆమె ఎందుకు హంతకులకు కొమ్ముకాస్తూ మరీ హత్య కేసు దర్యాప్తు దారి మళ్లించేందుకు యత్నిస్తున్నారన్నది కీలక ప్రశ్నగా మారింది. ఎందుకంటే.. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు తలెత్తాయన్నది బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో.. వివేకా హత్యకు గురికావడంతో ఆయన సొంత కుటుంబ సభ్యులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. వివేకా హత్య తరువాత ఆయన రాసిన లేఖ, సెల్‌ఫోన్లను పోలీసులకు వెంటనే ఇవ్వకుండా గోప్యంగా ఉంచమని పీఏ కృష్ణారెడ్డితో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఇదే అంశంపై సీబీఐ ఇటీవల వారిని విచారించింది కూడా. నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే వివేకా హత్య స్థలంలో ఆధారాల ధ్వంసం చేశారన్నది వెల్లడైంది కూడా. వివేకా రాజకీయ ప్రత్యర్థులైన టీడీపీ నేత బీటెక్ రవి, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డితో సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావగారు శివప్రకాశ్‌రెడ్డి అత్యంత సన్నిహితంగా ఉంటున్నారన్నది కూడా బహిరంగ రహస్యంగా మారింది.

వాస్తవాలు వెల్లడి కాకూడదనే..

ఈ నేపథ్యంలో.. వివేకా హత్య కేసులో సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డిల పాత్ర ఉందనే వాదన బలపడుతోంది. అంటే ఈ కేసులో వారిని నిందితులుగానే భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాబట్టి తాము బాధితులమని.. తమకే అర్హత ఉందని చెప్పేందుకు వారు నైతిక హక్కు కోల్పోయారు. మరోవైపు.. ఎర్ర గంగిరెడ్డి సీబీఐ ముందు నిజాలు వెల్లడిస్తే తమ కుటుంబానికి ఇబ్బందిగా మారుతుందని సునీత ఆందోళన చెందుతున్నారు. అందుకే వాస్తవాలు వెల్లడించకుండా కట్టడి చేసేందుకే ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు సునీత యత్నించినట్లు స్పష్టమవుతోంది.

శ్రీవారి ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు

తిరుమల: వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతోంది. సర్వదర్శనం భక్తులకు దాదాపు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు వేచి ఉండే సమయం ఇంకా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సామాన్య భక్తుల సౌలభ్యం కోసం జూన్ 30వ తేదీ వరకు స్వామి వారి సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్ర, శని, ఆదివారాల్లో సుప్రభాత సేవకు విచక్షణ కోటాను రద్దు చేశారు. తద్వారా 20 నిమిషాల సమయం ఆదా అవుతుంది. గురువారం తిరుప్పావడ సేవ ఏకాంతంగా నిర్వహించనున్నారు. తద్వారా 30 నిమిషాల సమయం ఆదా అవుతుంది. శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు. స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పించడం జరుగుతుంది. తద్వారా ప్రతిరోజు మూడు గంటల సమయం ఆదా అవుతుంది. క్యూలైన్లలో గంటల తరబడి కిలోమీటర్ల మేర వేచి ఉండే వేలాది మంది సామాన్య భక్తులకు ఈ నిర్ణయాల వల్ల త్వరితగతిన స్వామివారి దర్శనం లభిస్తుంది.

24న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమలలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లకు సంబంధించిన జూలై, ఆగస్టు నెలల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీ వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.in లో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

శ్రీశైల మహాకుంభాభిషేకం వాయిదా

కార్తీకమాసంలో నిర్వహించాలని నిర్ణయం

సాక్షి, అమరావతి: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు దేవదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ తెలిపారు. వేసవి వడ గాలుల దృష్ట్యా శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించవలసిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని పండితులతో సంప్రదించిన పిమ్మట, వారి సూచనల మేరకు పవిత్రమైన కార్తీకమాసంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఈ మార్పును భక్తులు గమనించాలని సూచించారు. ఈ విషయమై జ్యోతిష్య పండితుల ద్వారా ముహూర్తం నిర్ణయించి త్వరలో తేదీని ప్రకటిస్తామని దేవదాయ శాఖ కమిషనర్ వివరించారు.

ఆందోళనకరంగానే అవినాశ్‌రెడ్డి తల్లి ఆరోగ్యం

కర్నూలు (హాస్పిటల్): కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం పులివెందులలోని ఇంట్లో ఆమెకు గుండెనొప్పి రావడంతో కళ్లు తిరిగి కిందపడిపోయారు. వెంటనే స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. స్థానిక విశ్వభారతి హాస్పిటల్‌లో ఈసీజీ, 2డీ ఎకో, అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసీజీలో మార్పులతో పాటు కార్డియాక్ ఎంజైమ్స్ పెరగడం, బీపీలో మార్పులు ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. శనివారం సైతం శ్రీలక్ష్మికి ఈసీజీ, 2డీ ఎకో నిర్వహించిన అనంతరం యాంజియోగ్రామ్ పరీక్షలు చేశారు. ఇందులో రెండు వాల్వ్‌లు బ్లాక్ అయినట్టు గుర్తించామని కార్డియాలజిస్ట్ డాక్టర్ హితేష్‌రెడ్డి తెలిపారు. ట్రోపోనిన్ పెరగడంతో గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల కొన్నిరోజుల పాటు ఐసీయూలోనే చికిత్స అందించాల్సి ఉన్నట్టు చెప్పారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్యుల బృందం కృషి చేస్తోంది. కాగా, శ్రీలక్ష్మికి అందుతున్న వైద్యసేవలను ఎంపీ అవినాష్‌రెడ్డి దగ్గరుండి చూసుకుంటున్నారు.

ఈనెల 22న విచారణకు హాజరుకండి

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు!

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ అధికారులు మరోమారు నోటీసులు జారీ చేశారు. ఈనెల 22న కోఠిలోని సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అవినాశ్‌రెడ్డికి నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. శుక్రవారం సీబీఐ విచారణకు హాజరుకావాలని గతంలో సీబీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, తన తల్లి శ్రీలక్ష్మి అస్వస్థతకు గురవడంతో దర్యాప్తునకు హాజరుకాలేనని ఎంపీ అవినాశ్‌రెడ్డి తన న్యాయవాదుల ద్వారా సీబీఐ అధికారులకు లిఖిత పూర్వకంగా సమాచారం అందించారు. దీంతో మారోమారు విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు జారీ చేశారు.

వన సంరక్షణ కోరుతూ సైకిల్ యాత్ర


పాలకృష్ణతో గ్రీన్ భద్రాద్రి సభ్యులు

భద్రాచలంఅర్బన్: వన సంరక్షణ కోరుతూ ఓ వృద్ధుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా సింధనూరుకు చెందిన చాత్రాజుల విజయ గోపాలకృష్ణ దేశ శాంతి, జల, జంతు, వన సంరక్షణ కోరుతూ గత ఏడాది మార్చి 11న సైకిల్ యాత్ర ప్రారంభించాడు. ఇప్పటివరకు ఘనాపూర్, తుల్జాపూర్, షిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వరం, గుజరాత్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ శనివారం భద్రాచలం చేరుకున్నారు. ఈ మార్గంలో ప్రజలకు శాంతి, వన సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా బుద్ధగయ వెళ్తానని గోపాలకృష్ణ తెలిపారు. కాగా, ఆయనను గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు కామిశెట్టి కృష్ణార్జున్‌రావు, ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రాంబాబు తదితరులు కలిసి మాట్లాడారు.

బోధనేతర సిబ్బంది నియామకానికి కసరత్తు


ఉద్యోగులకు సూచనలిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తెలంగాణ గిరిజన గురుకుల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టుల కోసం దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన కొనసాగుతోంది. ఈ మేరకు భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయ ఉద్యోగులు దరఖాస్తులను పరిశీలిస్తుండగా, శనివారం ఐటీడీఏ ఏపీఓ (జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజు పలు సూచనలు చేశారు. దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ, ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేయించాకే స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ములకలపల్లి ప్రిన్సిపాల్ రాజేష్, ఉద్యోగులు కృష్ణార్జున్‌రావు, నరేందర్, విజయలక్ష్మి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

రూ.2 వేల నోట్లతో బారులు

- బ్యాంకుల్లో క్యూకట్టిన ప్రజలు
- బ్యాంకులతో పాటు ఏటీఎం యంత్రాల్లో డిపాజిట్
- ఇప్పటికే నిరాకరిస్తున్న పలు వ్యాపార సంస్థలు


ఖమ్మంలోని ఓ ఏటీఎంలో నోట్లు డిపాజిట్ చేస్తున్న వినియోగదారులు

ఖమ్మంవ్యవసాయం: పెద్దనోట్లను మార్చుకునేందుకు జిల్లావాసులు బ్యాంకులు, ఏటీఎంల బాట పట్టారు. రూ.2 వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించగా.. నోట్లు కలిగిన వారు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసుకోవడంతో పాటు మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవచ్చని ప్రకటించినప్పటికీ శనివారం కూడా బ్యాంకర్లు స్వీకరించారు. అలాగే, ఏటీఎంల్లోని డిపాజిట్ మిషన్లలో కూడా డిపాజిట్‌కు అవకాశం ఉండడంతో పలువురు క్యూ కట్టారు.

బ్యాంకు ఖాతాల్లో జమ..

ఆర్బీఐ ఉపసంహరించుకున్న రూ.2 వేల నోట్లు కలిగిన వారు ఈ నెల 23 నుంచి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భావనతో శనివారమే బ్యాంకులకు వచ్చి ఆరా తీయడం కనిపించింది. ఏటీఎం యంత్రాల్లో నేరుగా కొందరు జమ చేస్తుండగా, మరికొందరు బ్యాంకుల్లో నేరుగా డిపాజిట్ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని పలు బ్యాంకుల్లో పరిశీలించగా రూ.2 వేల నోట్ల డిపాజిట్‌కు వచ్చిన వారే ఎక్కువగా కనిపించారు.

నిరాకరిస్తున్న వ్యాపార సంస్థలు

రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ నుంచి ప్రకటన వెలువడగానే పలు వ్యాపార సంస్థల బాధ్యులు ఆ నోట్లు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు. మళ్లీ తామైనా బ్యాంకుల్లో జమ చేయాల్సిందేనన్న భావనతో వారు తీసుకోవడం లేదు. బ్యాంకులకు వెళ్లలేని పలువురు వ్యాపారులను సంప్రదిస్తే నిరాకరించడంతో మళ్లీ బ్యాంకులు లేదంటే ఏటీఎంలను ఆశ్రయించక తప్పడంలేదు.

ఖాతాలో డిపాజిట్ చేశారు..



వ్యాపారంలో భాగంగా వచ్చిన రూ.2 వేల నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేశా. కొంత కాలంగా ఈ నోట్లపై అనుమానాలు ఉన్నాయి. నోట్లు రద్దవుతాయనే ప్రచారం కూడా సాగింది. క్రమంగా నోట్ల వినియోగం బాగా తగ్గిపోయింది. ఇంతలో నోట్లు రద్దు చేయడంతో నా వద్ద అన్ని నోట్లను డిపాజిట్ చేశా.

–సోమారపు సుధీర్‌కుమార్, అడ్తి వ్యాపారి, ఖమ్మం

ఏటీఎంలో జమ చేసుకున్నా..



పెద్ద నోట్లు కదా అని రూ.2000 నోట్లు 16 దగ్గర పెట్టుకున్నాను. ఆర్బీఐ ఆ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించటంతో కంగారు పడ్డా. కానీ ఖాతాలో డిపాజిట్ చేసుకునే అవకాశం కల్పించడంతో మనసు కుదుట పడింది. దీంతో ఏటీఎంకు వెళ్లి డిపాజిట్ మిషన్ ద్వారా ఖాతాలో జమ చేసుకున్నా.

–ఎం.ఆరోగ్యరాజ్, నాయుడుపేట, ఖమ్మం

అత్యవసరంగా ఉపయోగపడతాయని..



పెద్ద నోట్లు కదా అత్యవసర సమయంలో ఉపయోగపడతాయని దాచిపెట్టుకున్నాం. ఆర్బీఐ చేసిన ప్రకటనతో అయోమయానికి గురైనా ప్రత్యామ్నాయాన్ని చూపించడంతో నోట్లు జమ చేసేందుకు వచ్చాం. పది నోట్ల వరకే అవకాశం ఇవ్వటంతో కుటుంబంలోని అందరి ఖాతాల్లో నగదును జమ చేస్తున్నాం.

–చింతాల దినేశ్, పెద్దతండా, ఖమ్మం

వేగ జ్యూయెలరీలో ఎగ్జిబిషన్, ఆఫర్లు


భిన్నమైన డిజైన్లలోని ఆభరణాలతో ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: విజయవాడ, హైదరాబాద్‌ల్లోని వేగ జ్యూయెలరీలో వెడ్డింగ్ జ్యూయెలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడమే కాక పలు ఆఫర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ వేడుకలు, వివాహాలకు కావాల్సిన కొత్త మోడళ్లలోని ఆభరణాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే, బంగారు ఆభరణాల తయారీపై 50 శాతం తగ్గింపు, డైమండ్ జ్యూయెలరీ క్యారెట్ రూ.56 వేలుగా ఆఫర్ ప్రకటించినట్లు చెప్పారు. ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఆభరణాల ప్రదర్శన, అమ్మకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుమలలో మంత్రి పువ్వాడ


తిరుమల ఆలయం వద్ద మంత్రి పువ్వాడ, కుటుంబ సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా శనివారం తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం అందించగా, టీటీడీ ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు ప్రగతిపథంలో నడవాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

జాతీయ మైనార్టీ కమిషన్ ఎదుట హాజరైన సీఐ


సీఐని వివరాలు అడిగి తెలుసుకుంటున్న సభ్యురాలు షహజాదీ

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ నాయకులపై నమోదు చేసిన కేసుల అంశంపై జాతీయ మైనార్టీ కమిషన్‌కు అందిన ఫిర్యాదుతో శనివారం విచారణ చేపట్టారు. హైదరాబాద్‌లో జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు షహజాదీ విచారణ చేపట్టగా, ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్ హాజరయ్యారు. ఇటీవల కలెక్టర్ దిష్టిబొమ్మ దహనం చేసిన ఘటనలో అక్కడ లేని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, మరికొందరిపై కేసులు ఎందుకు నమోదు చేశారని ఆమె ప్రశ్నించినట్లు సమాచారం. అలాగే, రెండేళ్లుగా జెడ్పీ సర్కిల్‌లో ఏయే రాజకీయ పార్టీల నాయకులు ఎవరెవరి దిష్టిబొమ్మలు దహనం చేశారు? ఎందరిపై కేసులు నమోదు చేశారనే సమాచారంతో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌ను ఢిల్లీలో తమ ఎదుట హాజరుకావాలని సూచించినట్లు తెలిసింది. కాగా, విచారణకు ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్‌తోపాటు బీజేపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ యాకూబ్‌పాషా, నాయకులు షేక్ షర్ఫుద్దీన్ తదితరులు హాజరయ్యారు.

జాతీయస్థాయి ఖో–ఖో పోటీలకు ఎంపిక


కాయం కిరణ్


కల్తీ అన్వేశ్


ఈసం వసంతరావు

కల్లూరు: గిరిజన జాతీయ ఖేల్ మహోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ముగ్గురు ఖో–ఖో క్రీడాకారులు ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచారు. వారిని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు ఖో–ఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం టెక్రాన్‌చిలకకు చెందిన ఈసం వసంతరావు, గుండాల మండలం దామరతోగుకు చెందిన కల్తీ అన్వేశ్, ఇల్లెందు మండలం సుదిమళ్లకు చెందిన కాయం కిరణ్‌కుమార్ జూన్ 9వ తేదీ నుంచి ఒడిశాలో జరిగే జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. క్రీడాకారులను ఖో–ఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, ఎస్.కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామయ్య, వీరరాఘవయ్యతో పాటు శ్రీహరి, పి.నరసయ్య, ఎస్.రామారావు, ఎ.కృష్ణ, పవన్‌కుమార్, ప్రసాద్ శనివారం అభినందించారు.

జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తి

- నేడు ఖమ్మం ఎస్‌బీఐటీలో పోలీస్ శాఖ ఆధ్వర్యాన నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ వారియర్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ వారియర్, అధికారులు

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో నిర్వహించనున్న జాబ్ మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాబ్‌మేళాకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి దాదాపు 15 వేల మంది నిరుద్యోగ యువత హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, కళాశాలలను పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ శనివారం పరిశీలించి సూచనలు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రముఖ కంపెనీలను ఒప్పించి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్హత కలిగిన దాదాపు 8 వేల మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయని భావిస్తున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు మాత్రమే పరిమితం కాకుండా కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు గణేశ్, ప్రసన్నకుమార్, రామోజీ రమేశ్, ఎస్‌బీఐటీ కాలేజీ చైర్మన్ కృష్ణ పాల్గొన్నారు.